# దొరలు

వీరన్న ఇస్త్రీలాగూ దానిపైన పొడుగాటి కోటూ వేసుకొని, జరీ తల పాగా పెట్టుకొని హడావిడిగా తిరుగుతున్నాడు. పగలు రెండుగంట లయినా భోజనము చేయటానికి అంతవరకూ తీరు బడి కాలేదు. వీరన్న భార్య ఎల్లి వీరన్న రాకకు ఎదురుచూస్తూ వాకిటి గడపమీద చేతిగోళ్ళను కొరుక్కుంటూ కూర్చున్నది.

ఆరోజు సాయంత్రము ఆరు గంటలకు వీరన్న నౌకరి చేస్తున్న క్లబ్బు భవనంలో సభ్యుల సమావేశము జరుగనున్నది. ఇటువంటి సమావేశాలు నెలకొకటి వంతున జరుగుతూ ఉంటాయి. ఆ క్లబ్బు ఆవరణములోని తోటలో, లానుమీద కుర్చీలనూ బల్ల లనూ అమర్చి, అక్కడక్కడ పూలచెట్లతో నిండిన తొట్లను పెట్టి అలంకరిస్తున్నాడు వీరన్న.

అంతలో కాంటీనునుండి పార్టీకి కావలసిన సామగ్రితో ఇద్దరు మనుష్యులు వచ్చి వీరన్నను పిలచారు. ముఖముమీది చెమటను తుడుచుకొని, వాళ్ళను లోపలికి తీసుకొని వెళ్ళి సామాను

లన్నీ గదిలో పెట్టించాడు వీరన్న. సీసాలను బల్లమీద జాగ్రత్తగా భద్రపరచాడు. అప్పటికి నాలుగు గంటలు కావచ్చింది. ఎల్లి రెండుసార్లు భోజనము మాట వీరన్నకు జ్ఞాపకం చేసింది. పని సందడిలో ఉన్న వీరన్న సరిగా కూర్చోకుండానే భోజనము ముగించి, ఎంగిలిచేతిని సరిగా కడుగుకోకుండానే తిరిగి తన పనిలో నిమగ్నుడై పోయాడు.

ఆ పట్టణము పేరెన్నికగన్న పట్టణాలలో ఒకటి. ఆ క్లబ్బు భవనము తెల్లదొరల పరిపాలనలో ఒక మండలాధికారియైన శ్వేత వర్ణునిచేత నిర్మింపబడినది. ఊరి బైటగా, ఎత్తయిన గుట్టమీద అందముగా కట్టబడినది. విశాలమైన భవనమూ, భవనములో మేలురకపు ఫర్నిచరూ, భవనము చుట్టూ రమణీయమైన పూదోటా, అవరణములో కుడి ప్రక్కగా ఈత కనువైన జలాశయమూ, దానిచుట్టూ పూపొదరిండ్లూ, భవనానికి ఎడమవైపుగా పెద్ద లానూ, దాని చుట్టూ సున్నము పూసిన ఇటుకల వలయమూ కన్నుల పండువుగా ఉంటుంది. వివిధ వర్ణములైన పుష్పజాతులతో తోట ఘుమాయిస్తూ ఉంటుంది. ఆ భవనములో పరులకు ప్రవేశము లేదు. ఆ భవనాంతర్భాగము ఎల్లా ఉంటుందని ఆ పురవాసు లెవరైనా వీరన్నను అడిగితే, మా ఊరి బాపనయ్య కథలో చెప్పిన ఇంద్రభవనములా ఉంటుందని నోరు ఊరేటట్లు ముచ్చటగా చెప్పుతూ ఉంటాడు వీరన్న. ఆ ఊరివాళ్లు చాలా మంది దానికి కోలాహలపర్వతమని పేరు పెట్టారు. ఆవరణములో ఒక ప్రక్కగా చిన్నయిల్లు కట్టించి, ఆ తోటనూ ఆ భవనమునూ భద్రముగా కాపాడటానికై భవనమును నిర్మించిన మండలాధికారి వీరన్నను నియమించాడు. తన కేర్పరచిన జీతముతో వీరన్న తృప్తిగా

జీవిస్తూ ఆ భవనమును కనిపెట్టుకొని ఉంటున్నాడు. మొదలు మొదలు దొరలతోనూ దొరసానులతోనూ మాట్లాడటము చేతగాక చేతిసైగలతో కాలక్షేపము చేశాడు. కాని త్వరలోనే వ్యాకరణ ప్రశంస విడచి, స్వతంత్రముగా అంగిరీజు భాషలో సంభాషణ నేర్చుకొని, వ్యవహారము నడపుకొనటము ప్రారంభించాడు. వీరన్న తన ఇరవై రెండవయేట ఈ నౌకరిలో చేరాడు. ఇప్పు డతనికి తలంతా పండిపోయింది. అరవై సంవత్సరాలు సమీపించాయి.

ఆ క్లబ్బుకు మొదలు మొదలు అంతా తెల్ల దొరలూ, దొరసానులూ వస్తూఉండేవారు. తరువాత, క్రమక్రమముగా నల్ల దొరలు కూడా ప్రవేశించటము మొదలు పెట్టారు. ఆ క్లబ్బులో ఇంతవరకూ సుమారు ముప్పైమంది కార్యదర్శులూ అధ్యక్షులూ మారగా వీరన్న చూశాడు. అధికారవర్గమూ, సభ్యులూ తమకు తెలియని వివరాలు ఏమైనా వీరన్నను అడిగి తెలుసుకుంటూ ఉంటారు.

ఆ క్లబ్బు పేరు "నవ్వు—నవ్వించు".

సుమారు ఆరుగంట లయ్యేసరికి సభ్యులు ఒక్కొక్కరే రావటము మొదలు పెట్టారు. సమావేశానికి కావలసిన సర్వసన్నాహముచేసి వీరన్న చేతులు కట్టుకొని గేటుదగ్గర నిలబడ్డాడు.

ఎల్లి అవయవ సౌష్ఠవముగల ఇరువదేండ్ల పల్లెపడుచు. ఆరు తులాల బంగారమూ, నలభై తులాల వెండీ పెట్టి వీరన్న రెండు నెలల క్రిందట ఎల్లిని పెళ్ళి చేసుకున్నాడు. వీరన్న తాళి గట్టిన పడుచులిద్దరూ వీరన్నకు సంతానము చూపెట్టకుండానే కాలము చేశారు. మూడవసారి చేసుకున్న ఎల్లి వీరన్నకళ్లకు మల్లెపువ్వులా కనబడుతున్నది. అక్కడికి రోజూ బంతి ఆడటానికి

వచ్చే నల్లదొరసానమ్మలను చూసి, పాదాల దగ్గరికి చీరె కట్టుకోవటమూ, తల వెంట్రుకలు మెడల మీదికి ముడి వేసుకొని దానిమీద పువ్వులను అర్ధచంద్రాకృతిలో అమర్చుకోవటమూ ఎల్లి నేర్చుకొని ఇప్పుడిప్పుడే "పట్టణపు సోకు" అలవర్చుకుంటున్నది.

ఎల్లి వీరన్నదగ్గరికి వచ్చిన తరువాత క్లబ్బులో ఇది మొదటి సమావేశము. సభ్యులందరూ వచ్చిన తరువాత ఒకసారి తన యింటిలోపలికి వెళ్లి, "తలుపులు వేసుకొని లోపలే ఉండమ"ని ఎల్లికి గట్టిగా చెప్పి తిరిగి తన పనిలోకి వెళ్ళిపోయాడు వీరన్న. తన కొరకు కూర్చోవద్దనీ, అన్నము తిని పడుకోమనీ మరీమరీ చెప్పి వెళ్ళాడు.

ఏడు గంటల తరువాత ఎల్లి అన్నము తిని మంచముమీద పడుకొని దొర్లటము ప్రారంభించింది. ఎల్లికి ఒంటరి భయము. వీరన్న ఎంతసేపటికీ రాడు!

ఉన్నట్లుండి వెయ్యికుక్కలు ఒక్కసారిగా అరచిన శబ్దము ఎల్లికి వినబడగా, అదిరిపడి మంచముమీద లేచి కూర్చున్నది. మరి కాసేపటికి వేయిపిల్లులు ఒక్కసారిగా మ్యావుమన్న అరపులు వినపడ్డవి. ఎల్లి భయపడి ఆ గదిలో ఒక మూలకు పరుగెత్తింది. తిరిగి అదేవిధముగా ఒకసారి పిల్లుల అరపూ, ఒకసారి కుక్కల అరపూ వరుసగా అరగంటసేపు వినవచ్చినవి. ఎల్లి భయముకొద్దీ కళ్ళు మూసుకొన్నది.

కాసేపటికి ఎల్లి ధైర్యము తెచ్చుకొని మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్ళి, కొద్దిగా తలుపులను తెరచి, ఆ శబ్దము ఎక్కడనుండి వస్తున్నదోనని అటూఇటూ చూడటము మొదలు పెట్టింది. ఎల్లి

యింటికీ సభ్యులుసమావేశమైన లానుకూ సుమారు పదిగజాల దూరము ఉంటుంది. క్లబ్బు సభ్యులు రెండు వరుసలుగా చీలి ఎదురెదురుగా నిలబడినట్లుగా ఎల్లికి కనబడ్డది. ఆ అరపులకు వాళ్ళుకూడా భయపడి లేచి నిలువబడినట్లుగా ఎల్లి భావించుకున్నది.

మరి కాసేపటికి సహస్రగార్దభము లొక్కసారిగా ఓండ్ర పెట్టినట్లు ఎల్లికి వినబడ్డది. ఈసారి ఎల్లి భయపడకుండా కిటికీ తలుపుల సందు గుండా చూడటము మొదలు పెట్టింది. రెండు రెండు తెగలుగా ఎదురుబడి నిలువబడిన సభ్యులు ముందుకువంగి నోరు తెరచినట్లూ, ఆ శబ్దము అక్కడినుండే బయలుదేరి వస్తున్నట్లు ఎల్లి అర్థము చేసుకొన్నది. ఈ అరపుల వలన కలిగిన ఆశ్చర్యము ఎల్లి ముఖముమీద అట్లా ఉండగానే, అందరూ కలిసి ఒక్కసారి గొల్లుమన్న శబ్దము వినవచ్చింది. ఎల్లి కిటికీ తలుపు లను మరికొంచెము తెరచి చూసి నిర్ఘాంతపోతూ ఉండగా "ఇంకా పడుకోలేదూ?" అంటూ వీరన్న లోపలికి వచ్చాడు.

"అదేమిటి...అటు చూడు!...అటు చూడు!" అని ఎల్లి వీరన్నను గట్టిగా పట్టుకొన్నది.

వీరన్న కిటికీలో తలపెట్టి చూశాడు. ఆ క్లబ్బులో నౌకరీ చేస్తున్న వీరన్న అటువంటి దృశ్యాలను అనేకము నిశ్చలముగా చూడటము నేర్చుకున్నాడు. చేతులనూ కాళ్ళను నేల కాన్చి, తల పైకెత్తి గాడిదలు ఓండ్ర పెట్టుతున్నట్లు సభ్యులు చూపుతున్న ప్రదర్శన మది!

"అదేమిటి? వాళ్ళు అట్లా చేస్తున్నారు!" అని ఎల్లి పీరన్న ఎదలో తలదాచుకున్నది.

"అవి దొరల ఆటలే ఎల్లీ! నీవు భయపడబోకు! వాళ్ళు దొరలు కదూ మరి! ఇక్కడున్నంతసేపూ అట్లా ఆడుకుంటారు." అంటూ పీరన్న ఎల్లి వీపు నిమిరాడు!

కథా నిలయం
865
శ్రీకాకుళం